


వేట్లపాలెం దుర్ఘటన కలచివేసింది: మోడీ 2


APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

01-03-2026
ఆదివారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 129
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com




# వేట్లపాలెంలో.. మృత్యు విస్ఫోటనం

- సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌లో పేలుడు
- 23 మంది సజీవదహనం
- 5 కిలోమీటర్ల మేర వినిపించిన శబ్దం
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- మృతుల్లో అత్యధికులు మహిళలే
- పరిమితికి మించి నిల్వ ఉంచడమే ప్రమాదానికి కారణమా?
- ఆరా తీసిన సీఎం చంద్రబాబు
- రంగంలోకి హోం మంత్రి అనిత
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**ఏపీ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం భారీ పేలుళ్లతో దద్దరిల్లి పోయింది గోదావరి కాలువ పక్కనే ఉన్న 'ఫైర్ వర్క్స్' బాణాసంచా తయారీ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో సంభవించిన భారీ పేలుడు 23 మంది నిరుపేద కార్మికుల ప్రాణాలను బలితీసుకుంది. పేలుడు ధాటికి భారీ ఎత్తున మంటలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. ప్రమాద సమయంలో లోపల మొత్తం 34 మంది పనిచేస్తుండగా, మంటల తీవ్రతకు 21 మంది అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మిగిలిన 13 మంది కార్మికులు తీవ్ర గాయాలపాలవగా, వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే ఉండటం స్థానికులను కలచివేసింది.

**యుద్ధక్షేత్రాన్ని తలపించిన ఘటనాస్థలి**

ఈ విస్ఫోటనం ఎంత శక్తివంతంగా ఉందంటే, దాని శబ్ద తీవ్రతకు సుమారు 5 కిలోమీటర్ల మేర భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పక్కనే ఉన్న గ్రామంలోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం స్లాబ్‌కు సైతం పగుళ్లు వచ్చాయి. ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలకు అక్కడ భీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉండగా, కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో గంటల తరబడి పోరాడి మంటలను అదుపులోకి తెచ్చారు. సామర్థ్యానికి మించి నిల్వ చేసిన మందుగుండు సామాగ్ర వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు,..

మిగతా 2లో...



# భూ భారతి కాదు.. భూ దోపిడీ..



- 37 మండలాల్లో కుంభకోణం
- నామమాత్రంగా ఆపరేటర్ల అరెస్టు
- హైకోర్టు చెప్పినా.. మారలేదు
- సిట్ విచారణకు హరీశ్ రావు డిమాండ్

2



శారదాపీఠం

# భూ కేటాయింపు రద్దు

- రేవంత్ సర్కార్ నిర్ణయం
- కోకాపేటలో గత ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల భూమి వెనక్కి
- జలమండలికి భూమిని కేటాయిస్తూ జీవో జారీ
- నిబంధనల ఉల్లంఘనపై అధికారుల ఆరా
- 99 రోజుల కార్యాచరణపై సచివాలయంలో సీఎం సమీక్ష



2

## పామాయిల్ రైతులకు తీపి కబురు

- టన్ను ధర రూ.21,546!
- గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే రికార్డు స్థాయిలో పెరిగిన గెలల ధర
- 15 వేల మంది రైతులకు రూ.2 కోట్ల అదనపు లబ్ధి
- ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీల్లో ఆధునిక యంత్రాలతో పెరిగిన నూనె రికవరీ శాతం
- ఎకరాకు రూ.50,918 రాయితీ
- వచ్చే ఏడాది మరో 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- తెలంగాణ ధరల నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రైతులకు సైతం ప్రయోజనం



2



## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 10 విమానాలు రద్దు

2



## రైతు రిజిస్ట్రీలో తెలంగాణ నంబర్ వన్

- 39,77,791 మందికిగాను 43,59,371 మంది రైతుల నమోదు
- 110 శాతం లక్ష్యాన్నిసాధించిన స్టేట్
- వ్యవసాయరంగంలో పారదర్శకతను పెంపొందించనున్న రైతురిజిస్ట్రీ
- అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రశంసలు

2

## ఇరాన్‌పై విరుచుకు పడిన ఇజ్రాయెల్-అమెరికా

- మినాబ్ నగరంలో బాలికల బడిపై దాడి
- 40 మంది విద్యార్థినుల దుర్మరణం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- 45 మందికి పైగా తీవ్ర గాయాలు
- 'ఇజ్రాయెల్ ఫస్ట్'గా మారిన ట్రంప్ నినాదం
- దుబాయ్ విమానాశ్రయాల కార్యకలాపాలు నిలిపివేత
- అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించారంటూ రష్యా తీవ్ర ఆగ్రహం
- విద్యార్థినుల ప్రాణాలను బలిగొన్న క్షిపణి దాడులు



2

2 స్నేహిత ఎక్స్‌ప్రెస్ 01-03-2026 ఆదివారం హైదరాబాద్ expresstelugudaily.com



# వేట్లపాలెంలో మృత్యు విస్ఫోటనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై పోయింది. విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుర్ఘటనపై స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించడంతో పాటు, హోం మంత్రి అనితను వెంటనే ఘటనాస్థలికి వెళ్లాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు హోం మంత్రి అనిత హుటాహుటిన వేట్లపాలెం బయలు దేరారు. ఇప్పటికే పోలీసులు 11 మంది మృతుల వివరాలను సేకరించారు. మృతుల్లో అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, ధనరాజు, సత్యవేణి వంటి వారు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుండగా, బాధిత కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది.



**వేట్లపాలెం మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు : సీఎం చంద్రబాబు**

వేట్లపాలెం బాణ సంచా తయారీ కేంద్రం పేలుడు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వాళ్ల కుటుంబాలకు రూ. 20లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం సాయంత్రం ఆయన కాకినాడ జిల్లా కేంద్రం చేరుకున్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వాళ్ల కుటుంబసభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాల్లోని పిల్లల చదువును బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. గాయపడినవాళ్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం మీడియాతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. బాధితుల్లో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. బాణా సంచా తయారీ కేంద్రాల పర్యవేక్షణలో విఫలమయ్యారని డీఎస్పీ, జిల్లా ఫైర్ ఆఫీసర్, జిల్లా లేబర్ ఆఫీసర్, ఆర్డీవోలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బాణా సంచా తయారీ కేంద్రం ఘటనకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దుర్ఘటనకు కారణమైన నిర్వాహకుల ఆస్తులు జప్తు చేసి, బాధిత కుటుంబాలకు అందజేస్తామని ప్రకటించారు. అనుమతి లేకుండా బాణ సంచా తయారుచేసేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దుర్ఘటనపై దర్యాప్తు కోసం కమిటీ ఏర్పాటుచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## ఇరాన్‌పై విరుచుకు పడిన ఇజ్రాయెల్-అమెరికా

**బ్యూరో:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు అంటుకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్ నగరంలో ఉన్న ఒక బాలికల పాఠశాల లక్ష్యంగా జరిగిన దాడిలో 40 మంది విద్యార్థినులు మరణించడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. దాడి సమయంలో పాఠశాలలో సుమారు 170 మంది విద్యార్థినులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో మరో 45 మంది తీవ్రంగా గాయపడగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ఇరాన్ పారామిలిటరీ దళమైన 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్' స్థావరం ఈ ప్రాంతంలో ఉండటమే దాడులకు ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ దారుణ మారణకాండతో ఇరాన్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

**రాజకీయ విమర్శలు - అంతర్జాతీయ స్పందన**

ఈ దాడులపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి చేస్తున్న ఈ యుద్ధం అక్రమమని ధ్వజమెత్తారు. ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని 'ఇజ్రాయెల్ ఫస్ట్'గా మార్చేశారని ఎద్దేవా చేశారు. దురాక్రమణదారులకు తమ సాయుధ బలగాలు తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు. మరోవైపు రష్యా ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్, అమెరికాలు అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కాయని ఆరోపించింది. ఖతార్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు సైతం వెంటనే దాడులు ఆపి, దౌత్య చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని డిమాండ్ చేశాయి.

**స్తంభించిన రవాణా వ్యవస్థ.. భారతీయులకు అలర్ట్**

యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం గల్ఫ్ దేశాల రవాణాపై తీవ్రంగా పడింది. దుబాయ్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అల్ మక్తుమ్ విమానాశ్రయాల కార్యకలాపాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి నోటీసులు ఇచ్చే వరకు విమాన సర్వీసులు అందుబాటులో ఉండవని ప్రకటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరపాలని కోరింది. ప్రస్తుత పరిస్థితులు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయేమోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 10 విమానాలు రద్దు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతుండటంతో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన విమానాలపై తీవ్ర ప్రభావం పడింది. శనివారం ఒక్కరోజే సుమారు 10 అంతర్జాతీయ సర్వీసులు రద్దయ్యాయి. ముఖ్యంగా దుబాయ్, దోహా, అబుదాబి, మస్కట్, కువైట్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు తమ గల్ఫ్ ఆపరేషన్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. గంటల తరబడి ఎయిర్‌పోర్ట్‌లోనే వేచి చూసిన ప్రయాణికులు, విమానాలు రద్దు కావడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**నిప్పుల కొలిమిగా పశ్చిమాసియా గగనతలం**

యుద్ధం భీకర రూపం దాల్చడంతో ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఖతార్, యూఏఈ, కువైట్, బెహ్రాయిన్ వంటి దేశాలు తమ ఎయిర్ స్పేస్‌ను పాక్షికంగా లేదా పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు ఖతార్ రాజధాని దోహాలో పడటంతో అక్కడ భారీ విస్ఫోటనాలు సంభవించాయని ఆ దేశ రక్షణ శాఖ ధృవీకరించింది. భద్రతా కారణాల దృష్ట్యా అంతర్జాతీయ విమానయాన సంస్థలు తమ మార్గాలను మారుస్తున్నాయి. లుఫ్తాన్సా, విజ్ ఎయిర్ వంటి సంస్థలు మార్చి 7వ తేదీ వరకు తమ సర్వీసులను పూర్తిగా రద్దు చేశాయి. ఢిల్లీ నుంచి టెల్ అవీవ్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఇజ్రాయెల్ గగనతలం మూసివేతతో గాలిలోనే వెనక్కి తిరిగి ముంబైలో ల్యాండ్ అయింది.

**ప్రయాణికులకు హెచ్చరిక**

ప్రస్తుత అత్యవసర పరిస్థితుల దృష్ట్యా విమాన సర్వీసుల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణానికి కనీసం 45 గంటల ముందే ఎయిర్‌లైన్ వెబ్‌సైట్లు లేదా హెల్ప్‌లైన్ ద్వారా విమాన స్థితిగతులను సరిచూసుకోవాలని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎంబసీ సూచనలను పాటించాలని కేంద్ర విదేశాంగ శాఖ సూచించింది. యుద్ధం మరింత ముదిరితే మరిన్ని సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని విమానయాన నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పామాయిల్ రైతులకు తీపి కబురు

**తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ పామాయిల్ సాగును లాభసాటిగా మార్చేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి టన్నుకు కేవలం రూ.12,534 ఉన్న పామాయిల్ గెలల ధరను ప్రస్తుత నెలకు ఏకంగా రూ.21,546కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ ధరల పెరుగుదల వల్ల రాష్ట్రంలోని 15,024 మంది రైతులకు సుమారు రూ.2కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరనుంది. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోని అప్పారావుపేట, అశ్వారావుపేట కర్మాగారాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన యంత్రాలను ఏర్పాటు చేయడం వల్ల నూనె రికవరీ శాతం 20.01కి పెరిగిందని, దీనివల్లే రైతులకు అధిక ధరలు చెల్లించడం సాధ్యమైందని ఆయన వివరించారు. తెలంగాణలో నిర్ణయించిన ఈ ధరలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాల్సి రావడంతో అక్కడి రైతులకు సైతం మేలు జరుగుతోందని పేర్కొన్నారు.

**భారీ లక్ష్యంతో సాగు విస్తరణ**

రాష్ట్రంలో వంట నూనెల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంట మార్పిడి పద్ధతిలో పామాయిల్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం సంకల్పించింది. 1992 నుంచి ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా, ఈ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే కొత్తగా 1,07,400 ఎకరాల్లో 33,500 మంది రైతులు సాగును ప్రారంభించడం విశేషం. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను పామాయిల్ సాగు కోసం ప్రభుత్వం రూ.456 కోట్లను కేటాయించింది. వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం 68,600 ఎకరాల నుంచి గెలల ఉత్పత్తి ప్రారంభమైందని, పామాయిల్ తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని మంత్రి కోరారు.నిరంతర ప్రోత్సాహం.. భారీ రాయితీలు

పామాయిల్ సాగు చేసే రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం నాలుగు ఏళ్ల కాలానికి ఎకరాకు రూ.50,918 రాయితీని అందిస్తోంది. దీర్ఘకాలికంగా అధిక లాభాలు ఇచ్చే ఈ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని, వంట నూనెల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతను వినియోగించుకుంటూ నూనె రికవరీ శాతాన్ని మరింత పెంచడం ద్వారా రైతులకు భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## వేట్లపాలెం దుర్ఘటన కలచివేసింది : మోడీ

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం
- మృతులకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పన పరిహారం
- ప్రకటించిన ప్రధాని

**ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 21 మందికిపైగా కార్మికులు దుర్మరణం పాలవ్వగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్న ప్రధాని మోదీ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ కష్టకాలంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చనిపోయినవాళ్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడినవాళ్లు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు.

## భూ భారతి కాదు.. భూ దోపిడీ..

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ అక్రమార్కులకు అడ్డాగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ధరణి మీద బురదజల్లి భూ భారతీ తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు ఆ పోర్టల్‌లో జరుగుతున్న కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. జనగామ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి మాట్లాడిన హరీశ్ రావు.. భూ భారతి పోర్టల్ పై నిప్పులు చెరిగారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. దళారులకు ఈ పోర్టల్ హారతి పడుతోందని మండిపడ్డారు.

**37 మండలాల్లో కుంభకోణం**

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పూర్తి డబ్బులు కడుతుంటే.. అందులో 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి వెళ్లేలా భూ భారతి పోర్టల్ లో మార్పులు చేశారని హరీశ్ రావు ఆరోపించారు. మిగతా 90 శాతాన్ని దళారులు తమ జేబుల్లో వేసుకుంటున్నారని విమర్శించారు. 37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా నడుస్తుంటే కనీసం నిఘా వ్యవస్థలకు కూడా తెలియకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమని విమర్శించారు.

**నామమాత్రంగా ఆపరేటర్ల అరెస్టు**

భూ భారతి కుంభకోణం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద అధికారులు ఉన్నారని హరీశ్ రావు ఆరోపించారు. వాళ్ల పేర్లు బయటకు రాకుండా కవర్ చేయడానికే నామమాత్రంగా ఆపరేటర్లను అరెస్ట్ చేసి కేసులు నీరుగారుస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడానికి కమీషన్ల మీద కమీషన్లు, సిట్ లు వేస్తున్న రేవంత్ రెడ్డి.. ఈ భూ భారతి కుంభకోణంపై, ప్రభుత్వ ఖజానా లూటీపై సిట్ తో విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు.

**హైకోర్టు చెప్పినా.. మారలేదు**

లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెట్టడం, వసూళ్లు కాగానే తీసేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని హరీశ్ రావు ఆరోపించారు. నేడు ఆ జాబితా కోటి ఎకరాలు దాటిందని.. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు నమ్మకంగా నాట్లకు ముందే రైతుబంధు వచ్చేదని.. రేవంత్ రెడ్డి మాత్రం ఎన్నికలు ఉంటేనే రైతుబంధు వేస్తున్నారని విమర్శించారు.

**ఏపీకి అడ్డగోలుగా నీళ్ల మళ్లింపు**

మరోవైపు నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ నీటిని వినియోగించుకుంటోందని హరీశ్ రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అడ్డగోలుగా మన నీళ్లను మళ్లిస్తుంటే రేవంత్ రెడ్డి అడ్డుపడటం లేదన్నారు. ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్తిగా ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఇలాగే వదిలేస్తే రేపు హైదరాబాద్ కు మంచినీళ్ల కటకట వస్తుందని హెచ్చరించారు.

## పేదల గూడు చెదరగొడతారా?

**తెలంగాణ బ్యూరో:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేత ఘటనపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బాధితులను స్వయంగా పరామర్శించిన ఆయన, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును శత్రుదేశం దాడితో పోల్చారు. వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసిన బడా బాబులను వదిలేసి, తలదాచుకోవడానికి చిన్న గూడు కట్టుకున్న నిరుపేదలపై ప్రతాపం చూపడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసైన్డ్, ఇనాం, భూదాన్ భూములు ప్రస్తుతం ఎవరి గుప్పెట్లో ఉన్నాయో నిగ్గుతేల్చే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. పేదల కులమంతా ఒక్కటేనని, వారి జోలికి వస్తే ప్రభుత్వం భరతం పడతామని హెచ్చరించారు.

**గత ప్రభుత్వాల కంటే ఘోరమంటూ విమర్శలు**

గతంలో కేసీఆర్ ప్రభుత్వం కూడా ఈ భూములపై కన్నేసిందని, అయితే ప్రజల తిరుగుబాటును చూసి అప్పట్లో వెనక్కి తగ్గిన విషయాన్ని ఈటల గుర్తు చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలకు కొత్తగా భూములు ఇవ్వకపోగా, ఉన్న నివాసాలను లాక్కోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తెల్లవారుజామునే భారీగా పోలీసులను మోహరించి, యుద్ధ వాతావరణాన్ని సృష్టించి ఇళ్లను కూల్చివేయడం పాలకుల అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి వెలుగుమట్ల ఘటనతో తేలిపోయిందని, తక్షణమే కూల్చివేసిన ప్రాంతంలోనే బాధితులకు కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లు కూల్చిన పాపం ఊరికే పోదని, రాబోయే రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## పోస్ట్ మార్టం రిపోర్ట్‌కు రూ.2లక్షల డిమాండ్

**హైదరాబాద్ :** మేడ్చల్ జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్‌లో వెలుగుచూసిన అవినీతి ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించింది. ఒక సాధారణ పోస్ట్ మార్టం రిపోర్ట్ కోసం సామాన్యులను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారో ఈ ఘటన అద్దం పడుతోంది. కీసర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నగేష్, తోటకూర మహేష్ అనే వ్యక్తి మృతికి సంబంధించిన పోస్ట్ మార్టం రిపోర్ట్ ఇప్పించేందుకు లంచం డిమాండ్ చేశాడు. గాంధీ ఆసుపత్రి డాక్టర్ సందీప్ పేరును వాడుకుంటూ.. రిపోర్ట్ కావాలంటే మొదట రూ. 2 లక్షల ఇవ్వాలని మృతుడి మేనల్లుడు శరత్‌ను వేధించాడు. నెలలు గడుస్తున్నా రిపోర్ట్ రాకపోవడంతో.. బాధితుడు అనేక మార్లు బ్రతిమిలాడగా చివరకు 40 వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. మహేష్ చనిపోయి నాలుగు నెలలు గడుస్తున్నా రిపోర్ట్ చేతికి అందకపోవడంతో బాధితుడు శరత్ అన్ని మార్గాలను అన్వేషించాడు. చివరకు ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ నుండి ఫోన్ చేయించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న హోంగార్డ్ నగేష్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. పైస్థాయి ఒత్తిళ్లు కూడా పని చేయకపోవడంతో విసిగిపోయిన బాధితుడు చివరకు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. శరత్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా పెట్టారు. మొదటి విడతగా ఇప్పటికే రూ.5 వేలు తీసుకున్న నగేష్ రెండవ విడతగా మిగిలిన రూ. 35 వేల తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేశారు. డబ్బు తీసుకుంటున్న సమయంలోనే నగేష్‌ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం నగేష్‌ను అదుపులోకి తీసుకుని.. ఈ వ్యవహారంలో డాక్టర్ల పాత్ర లేదా ఇతర పోలీసుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. సామాన్యులకు అండగా ఉండాల్సిన పోలీసు వ్యవస్థలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరం. బాధితుడు ధైర్యంగా ఏసీబీని ఆశ్రయించడం వల్లనే ఈ అవినీతి తిమింగలం పట్టుబడింది.

## శారదాపీఠం భూ కేటాయింపు రద్దు

**తెలంగాణ బ్యూరో:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, రానున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారదర్శక పాలనే లక్ష్యంగా ప్రతి శాఖ నుంచి పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష చేస్తూ, భూ కేటాయింపుల్లో జరిగిన లోపాలను సరిదిద్దే పనిలో పడ్డారు. ముఖ్యంగా విలువైన ప్రభుత్వ భూములను నామమాత్రపు ధరలకే కేటాయించిన అంశాలపై సీఎం ఆరా తీశారు.

**శారదాపీఠం భూమిపై కొరడా**

విశాఖ శ్రీ శారదాపీఠానికి గత కేసీఆర్ ప్రభుత్వం 2019లో కోకాపేటలో కేటాయించిన సుమారు రెండు ఎకరాల భూమిని రేవంత్ సర్కార్ రద్దు చేసింది. అత్యంత విలువైన ఈ భూమిని కేవలం గజం రూపాయి చొప్పున ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో అప్పగించడంపై మొదటి నుంచీ విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ కేటాయింపును రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సదరు భూమిని హైదరాబాద్ జలమండలి అవసరాల నిమిత్తం బదిలీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన కేటాయింపులపై అధికారుల తీరును సీఎం ప్రశ్నించారు.




**శాంతిభద్రతలు, ప్రమాదాలపై దిగ్భ్రాంతి**

పాలనాపరమైన సమీక్షలతో పాటు, వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పేలుడు ఘటనలు, ప్రాణనష్టం వంటి విషయాల్లో బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బాణాసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూనే, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## మక్కా యాత్ర ప్రమాద బాధితులకు 'రేవంత్' చేయూత

- బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- గాయపడిన వారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేత
- గతేడాది నవంబర్ 17న జరిగిన ఘోర ప్రమాదంపై ప్రభుత్వం స్పందన
- సజీవ దహనమైన 44 మంది హైదరాబాదీలు
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి హామీ





**తెలంగాణ బ్యూరో:** మక్కా యాత్రలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందిన వారికి రూ.3లక్షల చొప్పున సాయం అందజేశారు. పవిత్ర యాత్రకు వెళ్లి తిరిగి రాని లోకానికి వెళ్లడం అత్యంత దురదృష్టకరమని, ఆయా కుటుంబాల్లోని కష్టాలను తీర్చలేకపోయినా, ఆర్థికంగా అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధితులకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ఘటన నేపథ్యమిదే..**

గతేడాది నవంబర్ 17వ తేదీన మక్కా నుంచి బయలుదేరిన యాత్రికుల బస్సు మదీనా సమీపంలో ఘోర ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న బస్సు ముందున్న డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన 44 మంది యాత్రికులు బస్సులోనే సజీవ దహనమయ్యారు. డీజిల్ ట్యాంకర్ పేలడంతో మంటలు క్షణాల్లో బస్సు అంతటా వ్యాపించి, లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ వార్త అప్పట్లో నగరాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలను గుర్తించి, వారికి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టింది.

## రైతు రిజిస్ట్రీలో తెలంగాణ నంబర్ వన్

**తెలంగాణ బ్యూరో :** రైతురిజిస్ట్రీ నమోదుప్రక్రియలో 110% సాధనతో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా అవతరించింది. డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాల కింద రైతురిజిస్ట్రీ నమోదు ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం 100% నమోదు పూర్తి చేసి, భారతప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్నిమించి సాధించి దేశంలో అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా నిలిచింది.





**ప్రణాళికా బద్ధమైన చర్యలు**

తెలంగాణకు నిర్దేశిత లక్ష్యమైన 39,77,791 మంది రైతుల స్థానంలో 43,59,371 మందిరైతులను నమోదుచేసి, 110% లక్ష్యాన్నిసాధించింది. రైతురిజిస్ట్రీసృష్టి, రాష్ట్రంప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు కేంద్రం ప్రత్యేక సహాయం కింద రూ.422.64కోట్లు ప్రోత్సాహకాన్ని మంజూరు చేసింది. వ్యవసాయశాఖమంత్రి తుమ్మలనాగేశ్వరరావు దూరదృష్టి, నాయకత్వం, నిరంతరపర్యవేక్షణలో సాధించగలిగింది. గ్రామస్థాయి వరకు సమన్వయంతో పనులను సమీక్షిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించారు. మిగిలినపట్టాదారులను త్వరితగతిన నమోదు చేయడానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంది. అర్హులైన రైతులందరినీ పూర్తిస్థాయిలోచేర్చేదిశగాక్షేత్రస్థాయిలోప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రణాళికా బద్ధమైన చర్యలు, సమగ్ర పర్యవేక్షణ క్షేత్రస్థాయి అమలుతో అన్ని జిల్లాల్లో రైతుల నమోదు విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమం వ్యవసాయసేవల పారదర్శకతను మరింత బలోపేతం చేసింది. సంక్షేమపథకాలుసమయానుకూలంగా, అర్హులైనలబ్ధిదారులకునేరుగా అందేవిధంగా డేటా ఆధారితవ్యవసాయపరిపాలనకు ఇదిదోహదపడుతుంది.

**రైతురిజిస్ట్రీ వ్యవసాయరంగంలో..**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ సిబ్బందిని, వ్యవసాయ విస్తరణాధికారులు, మండలవ్యవసాయఅధికారులు, క్షేత్రసిబ్బంది, సాంకేతికబృందాలు, జిల్లాస్థాయి అధికారులను అభినందించారు. నిర్ణీతగడువులోప్రతి అర్హత కలిగిన రైతును చేరుకోవడంలో చూపినకృషి, సమన్వయం, అంకితభావాన్నిప్రశంసించారు. రైతు రిజిస్ట్రీ వ్యవసాయరంగంలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, సంక్షేమ పథకాలు, సేవలను ఆలస్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందించేందుకు దోహదపడుతుంది. డిజిటల్వేదికలనువినియోగిస్తూరైతుసంక్షేమం, సేవల మెరుగుదల, సుస్థిరవ్యవసాయ అభివృద్ధిదిశగా వ్యవసాయశాఖ, తెలంగాణ ప్రభుత్వం తన నిబద్ధతను మరోసారి స్పష్టం చేసింది.

**అధికారికగణాంకాలప్రకారం**

రాష్ట్రంలోనిమొత్తంపట్టాదారులు: 73.82 లక్షలు
కేంద్రం నిర్దేశించిన లక్ష్యం: 39,77,791 మంది రైతులు
తెలంగాణసాధన: 43,59,371 మంది రైతులు
సాధించిన శాతం: 110%

## ప్రతి ఉద్యోగికి..ఉద్యోగ విరమణ తప్పనిసరి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య





**మంచిర్యాల,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జిల్లా కార్యాలయంలో హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ తివారి ఉద్యోగ విరమణ మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య హాజరయ్యారు.సతీష్ తివారికి పూల మాల,శాలువాతో సత్కరించారు. కేక్ ను కట్ చేశారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్,డిఈఈ మునీందర్ ,సీనియర్ సహాయక ఇంజనీర్ డేవిడ్ భాస్కర్, నిజామాబాద్ జిల్లా సీనియర్ సహాయక ఇంజనీర్ సి.మాధవ రెడ్డి,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,సీనియర్ జర్నలిస్ట్ ఎల్గోయి ప్రభాకర్ సతీష్ తివారికి శాలువాలతో బొకేలతో సన్మానించారు.అయన చేసిన సేవల గురించి పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా గృహనిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్లు, ఆ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలి....!

- పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్
- కోహిర్ విశ్వభారతి పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫేర్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కోహిర్ విద్యార్థులు పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించాలని కోహిర్ విశ్వభారతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. కోహిర్ మండల పరిధిలోని శ్రీ విశ్వభారతి పాఠశాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్ లో ప్రతిభ చాటడంతో విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సైన్స్ ఫెయిర్ లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. 7వ తరగతి విద్యార్థి ఎం.ప్రేరిత గుండె ప్రతిమను తయారు చేసి అవ్రా అనిపించారు.పాఠశాల విద్యార్థులు రకరకాల ప్రతిమలను తయారు చేసి సైన్స్ ఫేర్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం: సిడిపిఓ కవిత

### గర్భిణి మహిళలకు ఘనంగా శ్రీమంతం




**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పోషకా హారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ కవిత అన్నారు. తిరుమలాయపాలెం మండల ంలోని మహమ్మదాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణి మహిళలకు శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ..గర్భిణీలు క్రమం తప్పకుండా పోషక విలువలు కల్గిన ఆహారాలు తీసుకుంటూ మంచి ఆరోగ్యం పొందాలని సూచించారు. సర్పంచ్ బోడా మంజురవి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం,ఆకుకూరలు సీజన్‌లో దొరికే పండ్లు తీసుకోవడం వలన పుట్టబోయే బిడ్డ,తల్లి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.బాలింతలు,గర్భిణీలు సంపూర్ణ పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం వలన శారీరకం బలంగా,ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు.అనంతరం గర్భిణీ మహిళలకు పట్టు వస్త్రాలు సమర్పించి ఘనంగా శ్రీమంతం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మీ, అంగన్వాడి టీచర్లు జినక శ్వేత,సారిక,జయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## కన్న తల్లినే కడతెరిచిన కొడుకు



**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కన్న తల్లికే కాలయముడైన కొడుకు అనే సంఘటన కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల మేరకు.కోటగిరి మండల కేంద్రంలోనీ బ్రాహ్మణ గల్లికి చెందిన మానాజీ మద్యానికి బానిస అయి,ఉన్న ఇంటినీ అమ్మివేద్దా మని తరచూ తన తల్లి అయిన పద్మశాలి భూమవ్వతో గొడవ పడేవాడు.అందుకు ఆమే అంగీకరించేది కాదు.శుక్రవారం రోజు మానాజీ మద్యం మైకంలో తల్లిని గాజు సీసా,రోకలు కర్రతో నెత్తిపై గట్టిగా బాదగా ఆమె అక్కడి కక్కడే మృతి చెందింది.అనంతరం మానాజీ అర్ధరాత్రి సమయంలో ఆమె శరీరంపై ఇంట్లో ఉన్న దీపం నూనెతో నిప్పుపెట్టగా ఆమె మెడ భాగం కొద్దిగా కాలంగా,కాళ్ళు మోకాళ్ళు కాలిపోయాయి. పద్మశాలి మాధవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సునీల్ పేర్కొన్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ నియోజికవర్గం పరిధిలోని నారాయణఖేడ్ మున్సిపల్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మన్మధ కిశోర్ గారి ప్రోత్సాహంతో విద్యార్థులు వివిధ శాస్త్రీయ ప్రయోగాలను అద్భుతంగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ హాజరై విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు, ప్రయోగాలను స్వయంగా వీక్షించి అభినందించారు.తను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని , ప్రస్తుతం పాఠశాలలో 900 విద్యార్థులు ఉండడం అభినందనీయమని, పాఠశాల మౌలిక వసతుల కోసం తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ..భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి,ధన్సింగ్,రాజశేఖర్, చంద్రశేఖర్ రాజయ్య,మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, పిఏసిఎస్ చైర్మన్ మారుతీ రెడ్డి,చామకురా పాండు,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు ఉచిత హెల్మెట్ పంపిణీ

### అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ ఎక్స్ రోడ్ వద్ద సీఐ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో క్యూబ్ హైవేస్ సహకారంతో హెల్మెట్ పంపిణీ కార్యక్రమం జరిగింది.డ్రైవింగ్ లైసెన్స్ ఉండి,హెల్మెట్ లేని వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శంకర్,ప్రవీణ్ రెడ్డి,నేషనల్ హైవే సిబ్బంది ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.

## ఇంపీరియల్ ఇగ్నైట్" -- యువత ప్రతిభకు వేదిక

- రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక విప్లవం మరింత వేగంగా ముందుకు సాగుతుది
- కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్
- యువత సైన్స్ మరియు టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాలు సాధించాలి
- కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక
- విద్యార్థులు నేటి నుంచే సాంకేతిక మార్పులకు సిద్ధంగా ఉండాలని, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి
- శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె. లక్ష్మి నారాయణ





**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా ఇంపీరియల్ ఇగ్నైట్ వేడుక .ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, డిప్లమా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ..విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా తత్వం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక విప్లవం మరింత వేగంగా ముందుకు సాగుతుందని,విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలు మరియు సృజనాత్మకతతో ముందుకు సాగితేనే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు సాధించగలరని తెలిపారు.భారత మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం చెప్పినట్లుగా, కలలు కనండి, ఆ కలలను నిజం చేసుకునే దిశగా కృషి చేయండి అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని నిర్వాహకులు సూచించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు, దీనికి అనుగుణంగా విద్యార్థుల కి కావాల్సిన అన్ని అత్యాధునిక ల్యాబ్స్ ఏర్పాట్లు కలశాలలో చేసాము అని అన్నారు.కలశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు మరియు పరిశోధనల ద్వారా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలరని తెలిపారు. దేశ అభివృద్ధి దిశగా యువత తమ జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకతను వినియోగించుకోవాలని సూచించారు. బాధ్యతాయుత పౌరులుగా మారి సమాజానికి సేవ చేయడం ప్రతి విద్యార్థి ధర్మమని, తమ ప్రతిభతో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై ఉంచాలి అని,దేశ ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆర్టిఫిషల్ ఇంటెజెన్సీ లో అవార్డు అందుకున్న తాల్లూరి పల్లవి ని ఆదర్శగా తీసుకోవాలి అని అన్నారు.కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, శాస్త్రం దేశ అభివృద్ధికి మూలాధారం అని, యువత సైన్స్ మరియు టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాలు సాధించాలని, విద్యార్థులు వారు చదువుతున్న సబ్జెక్టుతో పాటు ప్రాక్టికల్ అనుభవం కూడా కలిగి ఉండాలని అన్నారు.పాఠ్యపుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా ప్రయోగాత్మక నైపుణ్యాలు, ఇండస్ట్రీ అవగాహన ఉంటే భవిష్యత్తులో ఉద్యోగ సాధనలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాల వైపు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ జె. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు నేటి నుంచే సాంకేతిక మార్పులకు సిద్ధంగా ఉండాలని, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నిరంతర అభ్యాసం అవసరమని పేర్కొన్నారు.ఈ రెండు రోజుల కార్యక్రమంలో టెక్నికల్ సెషన్లు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, ఇన్నోవేషన్ చర్చలు మరియు మోటివేషనల్ స్పీచులు, సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డీన్ డాక్టర్ వి సుదర్శన్, టి పి ఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ఎలక్ట్రికల్ విభాగం అధిపతి కృష్ణ ప్రసాద్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి,డాక్టర్ చార్యులు, సురేష్ పాల్గొన్నారు.

## బాలల సృజనాత్మకత,ఆవిష్కరణ భళా..!

- కూసుమంచి ఉన్నత పాఠశాల అట్టహాసంగా సైన్స్ఎక్స్ పో
- ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు
- ఆలోచనా శక్తిని రేకెత్తించేదే సైన్స్
- ఎంఈవో రాయల వీరస్వామి



**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చిట్టి బుర్రలకు పదును పెట్టి,అద్భుతమైన ఆవిష్కరణలు రూపొందించి అబ్బుర పరిచారు. ఒక్కో నమునా దేనికదే ప్రత్యేకం.ఎవరి ఆలోచనలు వారివే.ఎటు చూసినా ఆలోచన రేకెత్తించే అంశాలే.. ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా 100కు పైగా నమునాలను జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ కూసుమంచి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్ ఫెయిర్ లో నమునాలు ఔరా అనిపించాయి. మెరుగు పెడితే మెరికలం..సానబడితే వజ్రాలం..అవకాశమొస్తే ఆకాశాన్నీ అధిగమిస్తాం..అని తమ వినూత్న ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు నిరూపించారు. విద్యార్థుల సృజనాత్మకతకు ఉపాధ్యాయుల సూచనలు జోడించి ప్రాజెక్టులు తయారు చేశారు.పీఎం శ్రీ కూసుమంచి ఉన్నత పాఠశాల శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్ పో కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి ప్రారంభించారు.ప్రదర్శనలను తిలకించి వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని అభినందించారు. విద్యార్థుల సృజనాత్మకత శాస్త్రీయ ఆవిష్కరణలతో ఆకట్టుకున్నాయి. వర్కింగ్ మోడల్స్ నవ మనుగడకు అవసరమైన సాంకేతికత పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో దాగి ఉన్న విజ్ఞాన ఆలోచన శక్తి రేపటి భవిష్యత్తు సైన్స్ అభివృద్ధికి దోహదం చేసే విధంగా ప్రదర్శనలు ఉన్నాయి.సోలార్ నమునా, జేసీబీల తయారీ,రోబో ఇలా 100 పైగా నమునాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు భావి ఆవిష్కరణలకు అంకురాలుగా నిలిచాయి.స్మార్ట్ విలేజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల రాయల వీరస్వామి మాట్లాడుతూ. .నిత్య జీవితంలో సైన్స్ ను అన్వయించు కోవాలన్నారు.దేన్నీ గుడ్డిగా నమ్మకుండా ఎందుకు..ఎలా ప్రశ్నించే తత్వాన్ని సైన్స్ నేర్పడంతో పాటు ఆలోచనా శక్తిని రేకెత్తించేదే సైన్స్ అన్నారు.ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత భూమి అగ్రవర్ణాల కబ్జా....!

- తమ భూమిని అగ్రవర్ణాలు కబ్జా చేశారని బాధితుల ఆవేదన
- కబ్జా అడ్డుకున్న గ్రామ సర్పంచ్ తనయుడు ప్రసాద్ రెడ్డి
- దళితుల భూమిని ఎలా కబ్జా చేస్తారని వాగ్వాదం
- బోరున విలపిస్తున్న దళిత బాధిత మహిళలు
- గత 40,సంవత్సరాలనుండి తాము కబ్జాలోనే ఉన్నామన్న బాధితులు







**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నియోజకవర్గం పరిధిలోని కోహిర్ మండలం సజ్జపూర్ గ్రామంలోని 27,సర్వేనంబర్ లో 1ఎకరం అసైండ్ భూమిని అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం దళితులకు బ్రతకడానికి సజ్జపూర్ గ్రామానికి చెందిన దళిత మహిళ అయిన కొతిలి ఎల్లమ్మ పేరుపైన ప్రభుత్వం సంబంధిత పత్రాలు జరిచేసింది. ఎల్లమ్మ చనిపోయిన తర్వాత ఆమె మూడవ కూతురైన అమృతమ్మ పేరుపైన అప్పటి తహసీల్దార్ సిబ్బంది రికార్డుల్లో పేరు నమోదు చేసినట్లు ఆధారాలు ఉన్నకూడా సజ్జపూర్ గ్రామానికి చెందిన కొత్తకాపు రమేష్ రెడ్డి,సుదర్శన్ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, మధు సుధన్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి,దళితులమైన తమ భూమి పైన దౌర్జన్యం చేసి మా ఎకరం భూమి కబ్జా చేస్తుంటే గ్రామ సర్పంచ్ కు సమాచారం అందించడంతో సర్పంచ్ తనయుడు ప్రసాద్ రెడ్డి కబ్జా అవుతున్న దళిత మహిళలమైన మా భూమి వద్దకు వెళ్లి కబ్జాకు గురవుతున్న సమయంలో జేసీబీని ఆపేయడం జరిగిందని లబ్ధిదారులు కొతిలి అమృతమ్మకు బాధితులు కోతిలి అమృతమ్మ, శివమ్మ, బుజ్జమ్మ, తెలిపారు. ఇదిలా ఉంటే శనివారం దళిత బాధిత మహిళలు తమకు ప్రభుత్వం ఇచ్చిన అసైండ్ భూమిని చట్టపరంగా స్వాధీనం చేసుకున్నారు. దళితులమైన మాకు న్యాయం చేయాలని సజ్జపూర్ గ్రామ సర్పంచ్ ను సర్పంచ్ తనయున్ని, గ్రామస్తులను వేడుకున్నారు. సానుకూలంగా స్పందించిన గ్రామ సర్పంచ్ కుమారుడు ప్రసాద్ రెడ్డి అండగా ఉన్నానని బాధితులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కబ్జా చేసిన వారు ఎంతటివరైన వదిలిపెట్టే ప్రసక్తే లేదని బాధితులకు ఇబ్బంది కలిగించే అగ్రకులస్తులు ఎవరైన పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠినంగా వ్యవహారిస్తామని అన్నారు.

## మతసామరస్యానికి చిహ్నంగా నిలిచిన జిల్లా బిఎస్పి ఇంచార్జి సయ్యద్ అమీర్



**మర్పల్లి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లాలోని తన సొంత గ్రామమైన కోట్ మర్పల్లి బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ అమీర్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వివిధ మతాలు,వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సోదరభావాన్ని చాటారు.ఈ సందర్భంగా సయ్యద్ అమీర్ మాట్లాడుతూ ..రమజాన్ నెల ప్రేమ,క్షమ,దానధర్మాల సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత, సామరస్యమే నిజమైన బలం అని పేర్కొన్నారు. పేదలకు సహాయం చేయడం, పరస్పర గౌరవం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు,స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. విందు అనంతరం దేశం శాంతి,సుభిక్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ ఇఫ్తార్ విందు గ్రామంలో ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు






**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మున్సిపల్ పట్టణ పరిధిలోని నెక్సస్ టెక్నో పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్, కిషన్ కరస్పాండెంట్ ప్రతినిధి నరేష్ కుమార్ చారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి విద్యార్థులే రేపటి పౌరులని,దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో అత్యున్నత స్థానాన్ని చేరుకోవాలని సూచించారు.విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వినోదాత్మక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యా, క్రీడా రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల,ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వేద పాఠశాలలో కంటి,దంత వైద్య శిబిరం

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రంలోని శ్రీ వేద పాఠశాలలో శనివారం లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో కంటి దంత వైద్య శిబిరం నిర్వహించారు.బోధన్ లైన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలను కంటి వైద్యులు అజయ్ నిర్వహించారు. విద్యార్థులకు దృష్టిలోప పరీక్షలు ఇతర కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.ప్రముఖ దంత వైద్యులు ఇర్ఫాన్ అలీ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి దంతాలపట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.ప్రతి ఒక్కరికి కళ్ళు పళ్ళ ఎంతో ముఖ్యమైన అవయవాలు అని,వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి అని సూచించారు.సుమారు 500 మంది విద్యార్థులకు పరీక్షల నిర్వహించి అవగాహన కల్పించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ అధ్యక్షులు తెల్ల రవికుమార్,శ్రీ వేద పాఠశాల కరస్పాండెంట్ తెల్ల అక్షర,సభ్యులు కప్పు సంతోష్ కోయ గూర శ్రీకాంత్,మోహన్ సెట్,వడ్ల ఉమాకాంత్,లైన్స్ క్లబ్ కంటి వైద్య శిబిరం క్యాంప్ ఇంచార్జ్ హనుమంతరావు పటేల్,శ్రీ వేద పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీ (బాయ్స్--1) నారాయణఖేడ్ లో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ రాములు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు అనేక వినూత్న నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక అభివృద్ధి, శక్తి సంరక్షణ వంటి అంశాలపై రూపొందించిన నమూనాలను అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.పాఠశాల విజ్ఞనశాస్త్రం ఉపాధ్యాయులు రమేష్ రెడ్డి మరియు ఆస్రా సుల్తానా లను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి సి.వి రామన్ లాంటి శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. విజ్ఞానం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ సంజీవ్ నాయక్, స్కూల్ కోఆర్డినేటర్ మొహమ్మద్ జాకిర్,పీ.ఈ.టి అజీజ్, పీడీ సంతోష్. ఉపాధ్యాయులు నవనీత, బుజమ్మ,సుధీర్,రవీందర్ మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'ఆజాద్' ప్రభంజనం

- 45మంది క్వాలిఫై అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న ఏకైక సెంటర్
- గత సంవత్సరం స్టేట్ మూడో ర్యాంక్ సొంతం
- జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం
- విద్యార్థులకు సన్మానం హర్షం వ్యక్తం చేసిన ఆజాద్ యాజమాన్యం
- కోచింగ్ సెంటర్లో మిన్నంటిన సంబరాలు

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో కూసుమంచి కేంద్రంలో నిర్వహించబడుతున్న ఆజాద్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచింగ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ అకడమిక్ డీన్ అజహరుద్దీన్ మహ్మద్ తెలిపారు. శుక్రవారం రాత్రి విడుదలైన ఫలితాలలో తమ కోచింగ్ సెంటర్ నందు కోచింగ్ పొందిన 50మంది విద్యార్థులలో 45మంది అర్హత సాధించారని తెలిపారు. గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో మూడవర్యాంక్ సాధించి ప్రభంజనం సృష్టించిన ఆజాద్ విద్యార్థులు ఆ ఆనందం మరువకముందే మళ్లీ తామేంటో నిరూపించి అత్యధికమంది క్వాలిఫై కావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.



### మిన్నంటిన సంబరాలు..

తమ కోచింగ్ సెంటర్ నందు శిక్షణ పొందిన విద్యార్థులు 45మంది అర్హత సాధించడంతో పాఠశాల ఆవరణంలో మిఠాయిలు పంచుకుని, పటాకులు కాల్చి తల్లిదండ్రులు, కోచింగ్ సెంటర్ యాజమాన్యం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకు న్నారు. ఈ సందర్భంగా డీన్ అజహరుద్దీన్ మాట్లాడుతూ..గత సంవత్సర ఫలితాల్లో కూడా అద్భుతమైన ప్రదర్శనతో నవోదయ 30 సీట్లు, ఏకలవ్య 14 సీట్లు,రాష్ట్ర స్థాయిలో స్టేట్ సైనిక్ మూడో ర్యాంకు, వందలోపు 14 ర్యాంకులు బ్యాక్ లాగ్ వేకెన్సీ లో 36 సీట్లు సాధించిన ఏకైక సంస్థగా జిల్లాలో ఆజాద్ కోచింగ్ సెంటర్ మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా




కరస్పాండెంట్ జానిమియా మాట్లాడుతూ..గత సంవత్సరం ఫలితాలతో పోలిస్తే,రానున్న ఫలితాలలో ఈ సంవత్సరం ఇంకా మెరుగైన విజయం సాధిస్తామనే విశ్వాసం వ్యక్తపరిచారు. అందుకు నిదర్శనమే ఈ ఫలితాలు అన్నారు. అంతేకాదు మమ్మల్ని నమ్మి మమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చిన విద్యార్థి తల్లిదండ్రుల రుణం ఏమిచ్చినా తీర్చుకోలేమని తెలిపారు. ఈ గెలుపునకు కారణమైన విద్యార్థులకు,శ్రమించిన ఉపాధ్యాయ బృందానికి, సహకరించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం చేసి, బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో డీన్ అజహరుద్దీన్ మహమ్మద్, డైరెక్టర్లు ఆజాద్, సబిహా,సయ్యద్ మియా,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యా వికాస్ లో ఘనంగా సైన్స్ ఫెయిర్

**ప్రిన్సిపాల్ ధార సోనియా డేనియల్**

**ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టు వర్క్స్**



**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ లు ఎంతగానో దోహదపడతాయని ప్రిన్సిపాల్ ధార సోనియా డేనియల్ అన్నారు. కూసుమంచి మండల కేంద్రంలోని విద్యా వికాస్ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్ర,సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న నూతన ఆవిష్కరణలను విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుంటూ తమ ప్రతిభను వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా చాటుకోవాలని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో టెక్నాలజీ పట్ల ఆసక్తి పెరిగి భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. దీనిలో భాగంగా పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులు సొంతంగా తయారు చేసిన పలు రకాల ప్రాజెక్ట్ వర్క్స్‌ను ప్రదర్శించి వాటి పనితీరును తోటి విద్యార్థులు, తల్లిదండ్రులకు,అతిథులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ధార చంద్రశేఖర్, ఉపాధ్యాయురాళ్లు వెంకటరమణ, ఉషశ్రీ,ఉషారాణి,సునీత,అశ్విని,నాగరాణి,తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఎస్ఐ రామలింగారెడ్డి పదవీ విరమణ

**అభినందనలు తెలిపిన ఎస్ఐ కూచిపూడి జగదీష్,మండల ప్రజలు**



**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పోలీస్ శాఖలో సుదీర్ఘంగా 41 సంవత్సరాల పాటు సేవలు అందించిన తిరుమలాయపాలెం అదనపు ఎస్ఐ మరెడ్డి రామలింగారెడ్డి శనివారం పదవీ విరమణ చేశారు. విధి నిర్వహణలో భాగంగా పలు ఫిర్యాదులు,సమస్యల పై పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధిత ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి వాటి పరిష్కారానికి ఆయన అవిరాళంగా కృషి చేశారు. పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో,పలు ప్రాంతాల్లో పని చేసిన ఆయన నిబద్ధత,సిన్సియారిటి కలిగిన పోలీస్ అధికారిగా ప్రజల మన్ననలు,అభిమానం పొందారు. ఈ సందర్భంగా ఎస్ఐ కూచిపూడి జగదీష్,పోలీస్ సిబ్బంది రామలింగారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖలో మచ్చలేని వ్యక్తిగా,గౌరవ ప్రదంగా పదవీ విరమణ చేయడం అభినందనీయం అని కొనియాడారు. శేష జీవితం అంతా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషమయంగా,ఆరోగ్యంగా జీవించాలని అభిలాషించారు.

# జిల్లా నూతన కలెక్టర్‌గా దీపక్ తివారి

**పదవీ బాధ్యతలు స్వీకరణ**





**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారి శనివారం సాయంత్రం 6.00 గంటలకు ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి,ఎసిఎల్ బి.సుధీర్,ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి,నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా మరియు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత,విద్యా, వైద్యం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు .జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. శాఖ ల వారీగా, మండలం వారీగా రివ్యూ చేస్తానని, మీరు చేపట్టే పనులు అభివృద్ధి ఫోటోలు మరియు పూర్తి వివరాల తో నోట్ సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మంగీ లాల్,ఆర్డిఓ వాసు చంద్ర,కాడ అభివృద్ధి అధికారి వెంకట్ రెడ్డి,డిఆర్డిఎ శ్రీనివాస్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకల్లో సైన్స్ టీచర్లకు ఘన సత్కారంచిన

**నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ**

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని మానూర్ మండలంలో ఉన్న బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో సైన్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు టి. నర్సింహులు మరియు జగదీష్ కుమార్ లను నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాలతో సన్మానించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు,సైన్స్ పట్ల ఆసక్తి కలిగించేందుకు ఈ ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. జాతీయ సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ, శాస్త్రం మన జీవితంలో ఎంతో కీలకమని, సమాజ అభివృద్ధికి శాస్త్రీయ ఆలోచన ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు విజ్ఞానశాస్త్రంపై అవగాహన పెంపొందించేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో సైన్స్ పట్ల మరింత ఆసక్తి కలిగించాలనే లక్ష్యంతో ఈ సన్మానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందం పాఠశాల విద్యార్థి విద్యార్థులు ఉన్నారు.



# విద్యార్థులు సైన్స్ పై ఆసక్తి పెంచుకోవాలి

**స్వామి వివేకానంద పాఠశాలలో ఘనంగా "నేషనల్ సైన్స్ డే" వేడుకలు**

**శాస్త్రవేత్త సి.వి రామన్ గురించి విద్యార్థులకు వివరించిన ఉపాధ్యాయులు**

**శాస్త్ర విజ్ఞానం దేశానికి ఎంతో ముఖ్యం**

**స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్ రెడ్డి**



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** విద్యార్థులు సైన్స్ పై ఆసక్తిని పెంచుకోవాలని స్వామి వివేకానంద పాఠ శాల కరస్పాండెంట్ కరు ణాకర్ రెడ్డి అన్నారు. శని వారం పెద్దేముల్ మండల కేంద్రంలోని స్వామి వివేకా నంద పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని(నేషనల్ సైన్స్ డే వేడుకలు )ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా భారతదేశ ప్రఖ్యాత శాస్త్రవేత్త సి.వి రామన్ జీవితం,ఆయన సాధించిన సాధనలు, శాస్త్ర రంగానికి ఆయన చేసిన సేవలను వివరించారు. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణకు గాను ఆయనకు నోబెల్ బహుమతి లభించిన విషయం విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ..శాస్త్రవిజ్ఞానం దేశాభివృద్ధికి ఎంతో ముఖ్యమని,ప్రయోగాత్మక విద్య ద్వారా సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. శాస్త్ర విజ్ఞానం ద్వారా సమాజానికి సేవ చేయగలిగే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శాస్త్రవేత్త లపై విజ్ఞాన ప్రసంగాలు నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందూరు గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**రూ.8 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతన అంగన్ వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభం**

**మార్క్ అవుట్ చేసి పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్**

**గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి**



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు ఇందూరు గ్రామ సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల పరిధిలోని ఇందూరు గ్రామంలో రూ. 8 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడి భవనానికి వార్డు సభ్యులు, అధికారులతో కలిసి మార్క్ అవుట్ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందూరు గ్రామ సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అంగన్‌వాడి భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు .చిన్నారుల విద్యా, పోషణ అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామంలో ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సుకుమార్ మహేందర్, ముక్తార్, సైదప్ప, నర్సింహులు ,ఆనందం వెంకటప్ప, నారాయణ, రహీం,పీఆర్ ఏఈ వినోద్ కుమార్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యం పేదల ఇల్లు కూల్చడమేనా

- పేదల ఇండ్లు కూలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు
- భూదాన్ కూల్చివేతలపై సీపీఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీ ఆగ్రహం
- ఖమ్మం వెలుగుమట్ల భూ నిర్వాసితులను ఆదుకోవాలి
- అదే స్థలంలో ఇండ్లు నిర్మాణం చెయ్యాలి
- తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం
- ఖమ్మం వెలుగుమట్ల ప్రజలకు అండగా సిపిఐ(ఎంఎల్)
- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఖమ్మం పట్టణంలో వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన భూమిలో అనేకమంది నిర్వాసితులు గూడును ఏర్పాటు చేసుకొని నివాసముంటున్నారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు, నోటీసులు గాని ఇవ్వకుండా 24వ తారీఖు నాడు తెల్లవారుజామున బుల్డోజర్లు,జెసిపిలతో ప్రభుత్వ అండ బలంతో పేదల ఇండ్లను కూల్చివేయడం జరిగింది. దీనిని




నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ దశల వారి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమైయింది ఈరోజు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రికి కంట్లో నలుసు పడ్డ విషయం మన మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి తెలుసు అట్లాంటి మంత్రి చలామణి చేస్తున్న జిల్లా కేంద్రంలో పేదల భూములు పేదల ఇండ్లు బుల్డోజర్ లో జెసిపిలో పెద్దపెద్ద యంత్రాలతోని నేలమట్టం అవుతుంటే తమ గోడును వినిపించుకోకుండా అధికార బలంతో పోలీసు వారితో పేద ప్రజలను నెట్టివేయడం జరిగింది. తక్షణమే పేద ప్రజలకు తక్షణ సహాయం కింద లక్ష రూపాయలు అందించాలని ఇళ్లను కోల్పోయిన నిరుపేదలను గుర్తించి అదే స్థలంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డిమాండ్ చేస్తుందని వారు అన్నారు. పేద ప్రజలను పాశవికంగా దుర్మార్గంగా స్థలంలో లేకుంట ఖాళీ చేయించడం అప్రజాస్వామికమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు పోలేపొంగు నాగయ్య,వీరాస్వామి,నగేష్,బింగి శ్రీను, రామకృష్ణ, సుధా, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ వీడ్కోలు సన్మాన మహోత్సవం


**ఆకట్టుకున్న పార్వతి మేడం బయోపిక్ ప్రదర్శన**

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కోటగిరి పాఠశాలలో వోకేషనల్ టీచర్ గా పనిచేస్తున్న,పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలైన మద్దినేని పార్వతి రమేష్ పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఉన్నత పాఠశాల కోటగిరి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయురాలు విద్యార్థుల చేత పార్వతి రమేష్ మేడం యొక్క బయోపిక్ అంశాలను పాఠశాల విద్యార్థుల చేత చేసిన పదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు పిఆర్టియు నాయకులు, ఆత్మీయులు,ఉపాధ్యాయులు,పుర విద్యార్థులు మేడం పదవి విరమణకు సంబంధించిన విరమణ కవితలు, సన్మానాలు ఈ మహోత్సవంలో అంబరానంటాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..33 వసంతాల ఉపాధ్యాయ వృత్తి ప్రస్థానంలో ఎందరెం దరో విద్యార్థులను జాతి గర్వించే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దిన పార్వతి మేడం విధి నిర్వహణను మించిన దేశసేవ లేదని కొనియాడారు. వృత్తి రీత్యా సమయ పాలన,అంకిత భావంతో విధులు నిర్వహించి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. పీఆర్టీయు సంఘంలో అత్యంత కీలక పదవులు అనుభవించి ఎనలేని సేవలందించారని అన్నారు. ఈ సందర్భంగా పార్వతి రమేష్ మేడం మాట్లాడుతూ..ఎక్కడ పనిచేసినా విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో గౌరవం పొందాలని అపుడే జీవితం సార్తక మౌతుందన్నారు. మీ అందరి ఆత్మీయ సన్మాన వీడ్కోలు నా జీవితాంతం గుర్తుంటుందని. మీరందరూ నాపై చూపిన ప్రేమానురాగాలు వెలకట్టలేనివని పార్వతి రమేష్ మేడం సంభ్రమాచార్యానికి లోనైనారు. ఈ సన్మాన వీడ్కోలు మహోత్సవంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటగిరి మండల విద్యాధికారి నాదెండ్ల శ్రీనివాస్ రావు,ముఖ్య అతిథులు గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్,మాజీ పిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి పూదోట రవి కిరణ్,కోటగిరి మండలం పిఆర్టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బర్ల సాయిలు, ఉదయ చందర్,రాష్ట్ర,జిల్లా,మండల కార్య వర్గ సభ్యులు,కోటగిరి ఇంటిగ్రేటెడ్ అధ్యక్షులు పోల విట్టల్ సేట్,సభ్యులు, పోతంగల్ హెచ్ఎం సాయిలు,రుద్రూర్ ఎంఈఓ శ్రీనివాస్,వర్ని ఎంఈఓ సాయన్న,పోతంగల్ మండల పిఆర్టియు అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కోటగిరి పాఠశాల సిబ్బంది,పార్వతి రమేష్ మేడం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,ఎంఆర్పి బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# కర్ల రాజేష్ మాదిగ మృతదేహానికి రీపోస్టు పోస్టు మార్టం

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చిలుకూరు పోలీస్ స్టేషన్లో లాకప్ డెత్ గురైన కార్ల రాజేష్ మాదిగ మృతదేహానికి శనివారం కోదాడ పట్టణ కేంద్రంలో గల గాంధీ నగర్ లోని స్మశాన వాటిక యందు రీపోస్టుమాస్టర్ నిర్వహిస్తున్న సందర్భంగా మహా జననేత సామాజిక ఉద్యమాల రథసారథి పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ,తెలంగాణ రాష్ట్ర మహాజన సోషలిస్ట్ పార్టీ కన్వీనర్ ఇంజము వెంకట్ స్వామి మాదిగ, జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు వంగూరి ఆనందరావు మాదిగ, జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ,కందుకూరి సోమన్న మాదిగ,వెంకటేశ్వరరావు, మాదిగ కొమ్ము శేఖర్ మాదిగ,సోమశేఖర్ మాదిగ సందే కార్తీక్ మాదిగ,బొర్రా బిక్షపతి మాదిగసూర్యాపేట జిల్లా ఇంచార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు మాదిగ,సూర్యాపేట జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఏపూరి రాజు మాదిగ, బకరం శ్రీనివాస్ మాదిగ, నల్ల చంద్ర స్వామి మాదిగ,బోడ సునీల్ మాదిగ,ఉమ్మడి నల్లగొండ సూర్యాపేట జిల్లా పరిధిలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ రాష్ట్ర జిల్లా మండల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు వడ్డేపల్లి కోటేష్ మాదిగ,మల్లె పొంగు సూరిబాబు మాదిగ,మల్లె పొంగు ఉపేందర్ మాదిగ కృష్ణమూర్తి మాదిగ, మీసాల భగత్ మాదిగ, మాతంగి వీరస్వామి మాదిగ,నాగరాజు మాదిగ, సిద్ధల శ్రీనివాస్ మాదిగ, ఇన్చార్జిలు మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు తూరుగంటి అంజయ్య మాదిగ,కూరపాటి సునీల్ మాదిగ, తోళ్ళ వెంకన్న మాదిగ, కూరపాటి ప్రభాకర్ మాదిగ తోళ్ళ సురేష్ మాదిగ,మాదాసు వెంకన్న మాదిగ,వీహెచ్పీఎస్ జిల్లా నాయకులు కట్టుకోల వెంకటేశ్వరరావు,కిట్టి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.



# రెండు నెలల పసికందు మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

**ఉమ్మడి మండలాల అధ్యక్షులు ప్యాట్ల పెంటయ్య**



**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రెండు నెలల పసికందు మరణానికి కారకులైన ప్రతిఒక్కరి కఠినాథి కఠినంగా శిక్షించాలనీ ఉమ్మడి కోటగిరి మండల రజక సంఘం అధ్యక్షులు ప్యాట్ల పెంటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కోటగిరి, పోతంగల్ మండల కేంద్రంలో రజక సంఘం ప్రతి నిధులతో కలిసి ఆయన అగ్రవర్ణాల అహంకారానికి వ్యతిరేకంగా నిరసన ధర్నా చేపట్టారు. ముందుగా కోటగిరి మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహనికి వారు పూల మాలలు వేసి నివాళులర్పించి తెలంగాణ కోసం పోరాటం చేసి ప్రాణాలను అర్పించి తెలంగాణను తెచ్చి పెట్టిన వీర వనిత వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ కు వారి బాధను విన్నపించుకుంటూ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఐలమ్మ విగ్రహం నుండి కోటగిరి బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా బయలుదేరి రజక జాతి ముద్దుబిడ్డకు న్యాయం జరగాలంటూ రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు వినతి పత్రాని అందించి బస్టాండ్లో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మండలాల అధ్యక్షులు ప్యాట్ల పెంటయ్య మాట్లాడుతూ..కుమ్మెర గ్రామం మల్లన్న జాతరలో బీసీ రజక కుటుంబానికి చెందిన గణేష్ మౌనికల రెండు నెలల పసికందును అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి వారి అనుచరులు పసికందు అని కూడా చూడకుండా ఆ పాపను కాలితో తన్ని చంపడం ఎంతో బాధాకరమనీ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వారి కుటుంబానికి 25 లక్షల ఎక్స్గ్రేషియా,ఆ కుటుంబంలోని ఓ వ్యక్తికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో మండలాలలో జరుగుతున్న ఈ ధర్నా,నిరసనలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ ఉపాధ్యక్షుడు సంగం రమేష్,కోటగిరి గ్రామ ఉపాధ్యక్షుడు రుద్రడం శ్రీను, ఉమ్మడి మండలాల రజక సంఘం నాయకులు ఎత్తోండ నారాయణ,దోమలెడ్గి రమేష్,సుంకిని రాజారాం, యదు,సుధాకర్,మేత్రి సత్య నారాయణ,గజేందర్,కోట్ల పెంటయ్య,ప్యాట్ల బాలయ్య, నాగరాజు,రవి,రాజు,రాము తదితరులు పాల్గొన్నారు.